# సిగరెట్టు చిలిపి చేష్టలు

సిగరెట్టుకూ నాకూ ఇంత సన్నిహిత సంబంధం ఏర్పడుతుందనిఎప్పుడూ అనుకోలేదు. సంసారికి ముడిపడిన పెళ్ళాంలా, హృదయానికి హత్తుకున్న ప్రేయసిలా, తెల్లకాగితంమీద నల్లని అక్షరంలా, శాస్త్రులుగారి తలకు పట్టుకు వేళ్ళాడుతున్న ముద్దుపిలకలా, సిగరెట్టు నా జీవితమంతా వెన్నంటుతూనేఉంది. నిద్రాహారశ్వాసలులేకుండా, ఎన్నిరోజులైనా ఉండగలనేమో కాని సిగరెట్టులేకుండా ఒక్కరోజు గడపడం అంటే, తద్దిన బ్రాహ్మణుడు గారెల్లేకుండా భోజనం చెయ్యవలసినంత బాధాకరంగా ఉంటుంది నాకు.

అసలు నేను సిగరెట్టుకాల్చడానికి నాందిగా చుట్ట త్రాగుడు అలవాటయింది నాకు.

నేను ఐదోక్లాసు చదువుతున్న రోజులు అవి. ఒకనాడు మునసబు దొరయ్యకొడుకు పాతికేళ్ళ తాత బాబు, రూళ్ళకర్రలా ఉన్న చుట్ట ఒకటి నోట్లోపెట్టుకుని కాలుస్తూ రింగురంగామంటూ ఠీవిగా క్లాసులోకి దిగాడు. మేష్టరు ఇంటిదగ్గర భార్య కారణంగా స్వయంపాకం చేసుకునే గతిపట్టి, జ్వరం వచ్చిందని సెలవు పెట్టారు ఆరోజు. అందువల్ల మాకు ఖాళీగా ఉంది.

తాతబాబు చుట్ట, బడిలో మాకందరికీ చాలాఆశ్చర్యం కలిగించింది.

'ఇదేమిటిరా?' అని అడిగాను.

'ఇది ఒక గొప్పరకం చుట్టరా! లండనునుంచి తెప్పించాడురా మా నాన్న!' అంటూ రైసుమిల్లు గొట్టంలా గుప్పుగుప్పున పొగవదిలాడు మా మీదికి. సమ్మోహనాస్త్రం ప్రయోగించినట్లు, ఆ పొగలు పెద్ద నల్లని మబ్బుల్లా వ్యాపించి, మాముక్కురంధ్రాల్లోకిపోగా, క్షయరోగుల్లాదగ్గుకుని బాధపడ్డాం. వాటిని తప్పించుకుని తాతబాబువైపు గుడ్లప్పజెప్పి వింతగా చూశాను.

ఇంకోచుట్ట ఉందాలని ఒక స్నేహితుడు తాతబాబు జేబులువెతికాడు. మరొకడు కాలుతూన్న తాతబాబు చుట్ట వేళ్ళతో తాకి, స్పర్శ సుఖంతో కులికాడు, మరొకడు ముక్కుతో ఆఘ్రాణించి బాగుందని కనుబొమలు ఎగరేశాడు. రైసుమిల్లుపొట్టులా గుట్టలుగా పడుతున్న ఆ చుట్టనుసి చూసి 'గొప్పచుట్టరా!' అంటూ మరొకడు కేరింతాలుకొట్టాడు.

తాతబాబు నోట్లోంచి చుట్టతీసి ఆ మధ్యభాగం అరచేతి మధ్య పట్టుకుని 'కాలుస్తావా?' అంటూ నాకేసి చూశాడు. భయంతో 'ఉహు' అన్నాను.

తాతబాబుకు నాచేత చుట్టకాల్పించాలని సరదాపుట్టింది: హఠాత్తుగా నాదగ్గరకువచ్చి, గబుక్కున తాను కాలుస్తున్నచుట్ట నానోట్లో కుక్కాడు. తక్కిన కుర్రవాళ్ళకు ఇదిఅంతా మరీ సరదాగాతోచింది. నన్ను బలవంతాన చుట్టపీల్చమన్నాడు తాతబాబు. నా స్నేహితుల పట్టుదల భరించలేక నాల్గుసారులు పొగపీలుస్తూ చుట్టకాల్చాను.

అంతే! అపొగ నాసికారంధ్రాల్లోంచి జాగ్రత్తగా నా మెదడులోకి ప్రయాణంచేసుకుని తిష్ఠవేసింది. నాఎదురుగాఉన్న స్నేహితులు,బెంచీలు గోడలు, నదిమధ్య సుడిగాలిలోఉన్న పడవలాగా, యిష్ట మొచ్చినట్లు ఊగులాడాయి. స్నేహితులముఖాలు మసకమసకగా మారి మంచులా కరిగిపోయాయి. నాకళ్ళముందు అనంతమైన శూన్యం కనిపించింది.

నేను మళ్లీ నా స్నేహితులను చూడగలిగేటప్పటికి ఒక బిందెడు నీళ్ళతో నా ఒళ్ళంతా తడిపేశారు. తలంటిపోసుకున్న ఆడదానిలా తేలిగ్గా లేచాను.

'ఏమయింది!' అన్నాను అమాయకంగా.

'నీబుఱ్ఱ తిరిగింది!' అని అందరూ గొల్లున నవ్వారు.

అంతే! వారి హేళనచూసి తీవిగా చుట్ట త్రాగడం ఎలాగైనా నేర్చుకుతీరాలని ప్రతిజ్ఞచేశాను. మానాన్న గూట్లో దాచుకునే లంకపొగాకు చుట్టలు తస్కరించి కాల్చేవాడిని. ఒకసారి గూట్లో చుట్టలు వెతుకుతూంటే తేలుకుట్టింది. కాని నాపట్టుదలమాత్రం విడువలేదు. ఒక్కొక్కసారి వాటి పరిమళం ఆఘ్రాణిస్తూంటే. స్వర్గసుఖం అనుభవించినట్లయ్యేది. త్వరలో చుట్టత్రాగడంలో ప్రవీణుడనయ్యాను. అవసరమైతే బీడీలుకూడా కాల్చేసే వాడిని.

ఈచుట్టలుత్రాగడంఅలవాటైన సమయంలోనే సిగరెట్లతోపరిచయం కలిగింది. ఒకరోజు తాతబాబు 'ఈకొత్తరకం చుట్ట చూశావురా!' అంటూ ఒక అందమైనపెట్టె చూపించాడు. ఆపెట్టెమీద హేటుపెట్టుకున్న ఒకదొరగారు హాయిగా ఆనందంగా పొగపీలుస్తున్నారు. 'ఇది సిగరెట్టు!' అన్నాడు దొరగారిలాగా తాతబాబు.

మొదట సిగరెట్లను రమణయ్య కిరానాషాపులో చూశాను. వాటి మీదినుంచి ఒక మత్తు సువాసన సెంటులా ముఖంమీదికి వచ్చింది. శ్వాస కోశాలనిండా ఆ సువాసన పీల్చి ఆనందించాను. తర్వాత మా యింటికి వచ్చిన ఎవరో పెద్దమనిషి ఒకరోజు అడిగితే, ఒక సిగరెట్టుపెట్టె కొని తెచ్చియిచ్చాడు. ఆ సిగరెట్లు కాల్చాలని బుద్ధిపుట్టినా బటానీలు కొనుక్కోడానికే, కానీకూడా మానాన్న యివ్వనప్పుడు మూడణాలతో ఒక పెట్టె కొనడం చాలా కష్టమైపోయేది.

తాతబాబు సిగరెట్టుపెట్టె చూపించగానే దొంగచాటుగా క్లాసువిడిచి వీధిలో రోడ్డుమీదికిపోయాం. ఒక చింతచెట్టుక్రింద కూర్చొని పెట్టెలోని పదిసిగరెట్లూ కాల్చేశాం. దొరల్లా గొప్పవాళ్ళ మవ్వాలంటే, సిగరెట్లు కాల్చితీరాలనే నిశ్చయించుకున్నాం.

ఒక్కొక్కసారి సిగరెట్టు కాలుస్తూంటే ఏమిటో ఒళ్ళు జలదరిస్తుంది. ఉపద్రవమైన ఉద్రేకంవస్తుంది. భరింపరాని విషాదం ఆవేశిస్తుంది. మితిమీరిన ఆనందం కలుగుతుంది. అసలు నవరస భావనలు నాలో ఒక్కొక్కసారి కల్గుతాయి. అందుకు నాజీవితంలో జరిగిన కొన్ని ఘట్టాలే కారణం.

* * * * *

కాలేజీకివచ్చాక రామమూర్తితో నాకు మొట్టమొదట పరిచయం కలిగింది.

రామమూర్తి చాలా బుద్ధిమంతుడని వాళ్ళ కుటుంబంలో చాలా ప్రతీతి. బి.ఏ. చదువుతున్నా మన పూర్వాచారాలమీద మక్కువ వదలక, ప్రొద్దున్నే తరవాణి అన్నంతినడం, మధ్యాహ్నం సుష్టుగా కందిపప్పు పచ్చడితో లగాయించడమూ, సాయంత్రం మాగాయిముక్కతో తేలికగా లేచి, త్రేన్చడమూ, అలవాపై, చార్మినారు సిగరెట్టుపెట్టె ఈగలాంటి పచ్చటిశరీరం పెంచుకున్నాడు. దాని ఫలితంగా తాతలఆస్తికి ప్రస్తుత ఆదాయం జతపరుస్తూ, కొండలాపెరిగే మ్యునిసిపల్ చెత్తాచెదారంలా ధనం పోగుచేస్తున్నారు; ఆ కుటుంబంలోని పెద్దతలకాయలు. బుద్ధిమంతుడైన వాడిని త్వరలో బుట్టలోవెయ్యవచ్చనే సదుద్దేశంకలిగి, ఒకరోజు రామ్మూర్తికి ఒక సిగరెట్టు అందిచ్చాను.

'అలవాటులేదండి' అంటూ సిగరెట్టు పెట్టిలో ముచ్చిబంగారపు రేకు ముడుచుకున్నట్లు, సిగ్గుపడి ముకుళించుకున్నాడు ముఖం అతను.

'ఇందులో ఏమీ నష్టంలేదండి' అని సిగరెట్టు చాలా మంచివస్తువు అనే గుణపాఠం ఆయనకు నేర్పబోయాను.

కాని, 'ఎన్నడూ కాల్చ లేదండి!' అన్నాడు రామమూర్తి వినయంగా.

'సిగరెట్టుఅనేది ఒక అగ్నిహోత్రం. బ్రాహ్మణుడు నిత్యాగ్నిహోత్రుడుగా ఉండాలని మన పెద్దలఅభిప్రాయం. ఈ కాలంలో మనకు జపతపాలు హోమాలు, చెయ్యడానికి ఎక్కడా అవకాశంలేదు కనుక ఒక్క సిగరెట్టయినాకాల్చి, మన బ్రాహ్మణత్వం ఋజువుచేసుకుందాం!' అని ఒక దీర్ఘ ఉపన్యాసం యిచ్చేను.

రామమూర్తికి ఏంబుద్ధిపుట్టిందో ఒకసారి ఆ సిగరెట్టువైపు కళ్ళు పెద్దవిచేసి, ఎగాదిగాచూసి, సువాసన ఆఘ్రాణించి, కొంచెం లొట్టలువేసి ఆ సిగరెట్టుకేసి నవ్వాడు. కందిపప్పు పచ్చడిరంగులోఉన్న ఆ సిగరెట్టుపెట్టె, అందులో మాగాయిముక్క మధ్యనపెట్టిన తరవాణ్ణి అన్నపు ముద్దలాఉన్న ఆ సిగరెట్టు, రామమూర్తి అభిరుచికి నచ్చి ఉండవచ్చు. తక్షణం నోట్లోపెట్టుకున్నాడు. నేను వాడి సిగరెట్టుకు నిప్పు ముట్టించాను. తర్వాతకాని నాకు తెలియలేదు; నేను వాడి జీవితానికే నిప్పు ముట్టించినట్లు.

ఏ ముహూర్తాన రామమూర్తి సిగరెట్టుపట్టుకున్నాడో. ఆముహూర్తం చాలా బలమైన శుభగ్రహాలతోకూడిన ముహూర్తమైఉండాలి. వామనావతారం క్రమక్రమంగా ఎదిగి బ్రహ్మాండమంత ఐనట్లు, అతడి సిగరెట్లు త్రాగుడుకూడా ఎక్కువై, రోజూకాల్చే సిగరెట్లవల్ల ఒక మేరు పర్వతమంతనుసి, సిగరెట్టుపీకలు చేర్చేవాడు. అప్పటినుంచి రామమూర్తి దయవల్ల నాకు సిగరెట్లఖర్చు తగ్గిపోయింది.

ఒకరోజు నాదగ్గరకు బేలముఖం వేసుకుని రామమూర్తి వచ్చాడు.

'ఏంరా?' అన్నాను.

'పెద్ద చిక్కుసమస్య వచ్చిందిరా!' అన్నాడు.

ఇంట్లో భార్యతో రామరావణ యుద్ధం జరుగుతోందట. రామమూర్తికి సిగరెట్టు అంటే ఎంత అభిమానం ఏర్పడిందో. దానికి ముందే ముడి పడిన భార్య అంటే అంతకు పదిరెట్ల అభిమానం! ఆవిడ సిగరెట్లు కాల్చవద్దని ఒక శాసనం చేసిందట! ఇటు భార్యను వదలు కోవడమా, అటు సిగరెట్టు పదలుకోవడమా, అనే చిక్కు సమస్యలో పడి మరణ వేదన అనుభవిస్తున్నాడు మా రామమూర్తి. సిగరెట్టు కాల్చడం మానక పోతే తనే మనవాణ్ణి వదులుకుంటానని శంఖనాదం పూరించిందట ఆవిడ.

నేను ఒక సలహా యిచ్చాను.

"మీ ఆవిడకు కూడా సిగరెట్టు నేర్పరా! దీనితో సమస్య యిట్టే విడిపోతుంది" అని.

"అయ్య బాబోయి! ఇంకేముంది!" అన్నాడు రామమూర్తి.

"మీ ఆవిడ చదువుకుందా!"

"ఆఁ. మూడవ ఫారము మూడుసార్లు ఫేలయి నాల్గోఫారం సగం చదివి. పెళ్ళయినాక పూర్తిగా మానేసింది చదువు" అన్నాడు.

''ఇంక నేం! ఆ మాత్రం చదువుకున్న ఆడవాళ్ళు మొగవాళ్ళతో సమాన హక్కులు కావాలంటారు! మొగవాళ్ళలాగా సిగరెట్లు కాల్చగలి గితేనే, సమాన హక్కులు వస్తాయని నచ్చచెప్పు!" అన్నా.

"అది కుదరదురా." అన్నాడు రామమూర్తి.

నా పాచిక పడలేదు. తర్వాత రామమూర్తి సిగరెట్టు కాల్చడం మానలేక పోయాడు. బోగందాని వెంటవున్న. శ్రీహరి విటుడికి కలిగించే తలనొప్పికి పదిరెట్లు రామమూర్తికి కలిగేది సిగరెట్లు మానేస్తే!

ఒకరోజు రామమూర్తి ఏడుస్తూ నాదగ్గరికి వచ్చాడు.

"మాఆవిడ లేచిపోయిందిరా!'' అంటూ.

నేను కారణం అడగ దల్చుకోలేదు. అడిగితే తిరిగి బాధ్యతా పూరితమైన సమాధానం నేనే యిచ్చుకోవలసి వస్తుంది.

తర్వాత విన్నాను. లేచిపోయిన రామమూర్తి భార్య మళ్ళీ రాలేదుట! భార్యమీద మమకారం త్రెంచుకోలేక, మరో పెళ్ళి చేసుకోలేక, ప్రజలకు ముఖం చూపలేక, తన గదిలో ఏకాంతంగా నిత్యాగ్ని హోత్రుడులా, నిమిష నిమిషానికి ఒక్కొక్క సిగరెట్టు ప్రజ్వలింపజేస్తూ, మహోగ్ర తపం చేసే మునీశ్వరుడిలా. ముంగిలా, ఒక మూల కూర్చుంటూ జీవితాన్ని గడుపుతున్నాడుట!

* * *

నేను చదువులు చాలించాక ఒకాయన దగ్గరకు ఉద్యోగానికి వెళ్ళాను.

బిగుతైనసూటు. పొట్టి ఆకారము. పాలకాయలాగ అతినున్నని బట్టతల.లావుపాటి పచ్చటి శరీరము... వీటన్నిటితో సూటుతొడుక్కున్న ఒక పెద్ద గుమ్మడికాయ లాగా కుర్చీలో కూర్చున్నాడు.

లంక పొగాకు చుట్ట ఒకటి నోట్లో పెట్టుకుని నమిలేస్తూ, పొగ వదిలేస్తున్నాడు వేడి వేడి రైల్వేయింజనులా. ఆయన చేతిలోని కలం కూడా రైలు చక్రాల్లా గబ గబా పరుగిడుతోంది! పట్టాల్లా పడివున్న ఒక తెల్ల కాగితంమీద.

''నమస్కారమండి!'' అన్నాను.

మాట్లాడకుండానే ఆయన ప్రతి నమస్కారం పెట్టాడు.

''నేను ఒక అర్జంటు పనిమీద వచ్చాను''.

"కూర్చోండి!'' అన్నాడాయన.

అయన బొల్లి పెదిమల మధ్య నల్లగా గారకట్టిన పళ్ళు, సిగరెట్టు చివర కనిపించే పొగాకు ముక్కల్లా ఒక్కసారి తొంగిచూసి, తిరిగి సర్దుకున్నాయి.

"తమ దగ్గర ఒక టైపిస్టు పని ఖాళీ ఉందని వచ్చానండి!''

''బాగా టైపు చెయ్యగలరా?"

''చేస్తానండి.''

''అయితే రేపు ఉద్యోగంలో చేరండి!''

నేను ఆశ్చర్య పోయాను.అంత సులువుగా ఉద్యోగం దొరికిందేమా అని.

"తమరు జీతం...'' నసిగాను.

"తర్వాత చూసుకుందాం"ఆయన ముఖం చిట్లించాడు.

నేను బయటికి నడువబోయాను.

''ఆ! ఏమండీ! మీకు పెళ్ళయిందా?'' అన్నాడు.

''లేదు'' అన్నాను.

"అయితే మీరు ఒక్కరే కాబట్టి, మా దొడ్లోనే ఒక గది ఖాళీ గా వుంది. అందులో ఉండండి!'' అన్నాడాయన ఆప్యాయంగా దానకర్ణుడిల్లా నవ్వుతూ.

"ఎంత అదృష్టం!'' అని నన్ను నేనే పొగడుకున్నా.

ఉద్యోగంలో చేరిన మర్నాడు ప్రొద్దునే లేచి, ఒక సిగరెట్టు వెలిగించి. కాలకృత్యాలు తీర్చుకుందామని నా గది బయటికి వచ్చాను.

"ఏమ్! పంతులూ!" అంటూ యజమాని పిలిచాడు.

సిగరెట్టు త్రాగుతూనే ఎదురుగా వెళ్ళాను.

"నువ్వు సిగరెట్టు త్రాగుతావా ఏమిటి?''

"అవునండి అప్పుడప్పుడు!''

"ఏమ్! అబ్బాయి! ఇక్కడ పనిచేసే వారెవ్వరూ సిగరెటు త్రాగ కూడదు.

"అదేమండి!'' అంటూ ఆశ్చర్య పోయాను.

"అ మాత్రం జ్ఞానం లేదుటయ్యా నీకు ? నేనుచేసే వ్యాపార మేమిటి? చుట్టల వ్యాపారమని తెలుసా!"

"అయితే?" అర్ధంకాక కొంచెం కంగారు పడ్డాను.

"నావాళ్లే సిగరెట్టు త్రాగితే యింకా చుట్టలు కొనేవాడెవడయ్యా!" అని అరిచాడు యజమాని.

"నేను చుట్టలు కాల్చడం మొదలు పెడితే మీ వర్తకంలో లాభాలు వస్తాయాండి!" అన్నాను.

"ఆఁ! గుమస్తాగాడివి ఏం నీలుగుతున్నావు? ఏమైనా సరే! యీ సిగరెటు త్రాగడానికి వీల్లేదు!'' అంటూ ఆయన ఒక మహా రాక్షసుడిలా నామీదకు విజృంభించి, నా నోట్లోని సిగరెటు పీకేశాడు. నా గదిలో మిగి లిన రెండు సిగరెటు పెట్టెలు బలవంతాన పట్టుకుపోయి ఇంట్లో పొయ్యిలో పారేశాడు.

నాకు ఏం చెయ్యాలో బోధపడలేదు. అ రోజు సాయంత్రం చాటుగా బయటికి పోయి, ఒక పెట్టె తెచ్చుకుని. రాత్రి భోజనమయ్యాక. ఆ యజ మాని ఇంటి కాంపౌండులో వున్న ఒక మామిడి చెట్టుకింద కూర్చుని ధూమపానం చేసుకుంటున్నాను.

ఒకావిడ ఆంగ్ల వనితలాగా ఒక గిరజాల క్రాపుతో. నల్లటిసిల్కు చీర తొడుక్కుని, స్లిప్పర్లు టిక్కుటక్కుమని ధ్వని చేసుకుంటూ. ఎదురుగా వచ్చింది. ఆవిడ యజమాని భార్య అని చూచాయగా విన్నాను. అధమం ఒక నలభై ఏండ్లుంటాయి ఆవిడకు.

"మీరు సిగరెట్టా కాలుస్తూంటా!" అంది ఆవిడ.

నాకు మళ్ళీ భయం పుట్టింది! నామీద దండయాత్రకు తనభార్యను కూడా పంపించేడా అని.

"నాకు కూడా ఒక సిగరెటు యిప్పించండి" అందామె.

నేను ఆశ్చర్యపోయాను. ఆడవాళ్ళు సిగరెటు త్రాగడాన్ని చూడడము అదే మొదటిసారి నాకు.

"నేను లండనులో వుండి చదువులు పూర్తిచేసుకునేదాకా హాయిగా వున్నానండి, ఎన్నో సిగరెట్లు చక్కగా కాల్చుకునే దాన్ని. కర్మంజాలక ఈయన్ను పెళ్ళిచేసుకోడంతో. ఒక సిగరెట్టు కూడా కరువైపోయింది. అంది ఆమె.

నేను చెవులు బాగా విప్పుకుని వింటున్నాను.

"మా పెద్దమ్మాయి ఫారిన్‌లో చదువుకుంటోంది. రెండో అమ్మాయి ఢిల్లీలో చదువు కుంటోంది, వాళ్లు ఎప్పుడైనా సెలవులకు యింటికివస్తే! చాటుగా నాలుగైదు సిగరెట్టు డబ్బాలు తెచ్చిపెడతారు నాకు.

"అలాగాండి!" అని ఒక్క నిట్టూర్పు విడిచాను ఆవిడ అవస్థకు.

"మా పెద్దమ్మాయి సిగరెటు చాలా షోకుగా కాలుస్తుందండి! మూతికి చివరగా! పెదిమలకు అంటీ అంటనట్లు, సిగరెటు పెట్టుకుని, ఎంత పనిచేస్తున్నాసరే! అ సిగరెట్టు మళ్ళీ చేతులతో ముట్టుకోకుండా. చాలా

తేలిగ్గా పొగ వదిలేస్తూ,చమత్కారంగా కాల్చగలదు!మా రెండో అమ్మాయి చూశారూ! రెండేసి సిగరెట్లు ఒక్కసారే కాల్చేసే అలవాటు ఆమెకు!"

ఆవిడ కూతుళ్ళ గొప్పదనం విని దిగ్భ్రమతో కళ్ళు విప్పుకుని ఆవిడ కేసి చూశాను.

"హిహిహి" అని నవ్వింది. ఆమె.

ఇంతలో మా యజమాని దూరంగా కనిపించాడు. ఇద్దరం తప్పుకున్నాం.

సిగరెటు అనేది ఎటువంటి వాళ్ళనైనా ఒక సన్నిహితత్వానికి తీసుకు వస్తుంది. ఇటువంటి సన్నిహితత్వం చాలా ప్రమాదకరంగా పరిణమించడంవల్ల, నేనీ ఉద్యోగానికి వచ్చాను. నేను పనిచేసిన రోజులకు యజమాని ''జీతమిస్తా, రమ్మని" కబురంపినా: తిరిగి ఆ ప్రాంతాలకు నేను వెళ్ళడానికే భయపడ్డాను.

ఉద్యోగంలో స్థిరపడ్డాక ఒక రోజు సిగరెటు కాలుస్తూ మా మేడ మీది ఆరుబయలు వరండాలో వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాం.

మా అక్కయ్య కూతురు కమలవచ్చి నా ప్రక్కన కూర్చుంది.

ఒకరిని చూసి ఒకరం చిదానందంగా నవ్వుకున్నాం.

చల్లని పిల్లగాలి మెల్లిగా విసిరింది. మా అక్కయ్య మేడమీది గుమ్మందాకా వచ్చి కాబోయే దంపతులని మమ్మల్ని చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

జేబులో ఉన్న కొత్తసిగరెటు పెట్టె తీసాను బయటికి, కమల నా కేసి చూసింది. అప్పుడే యౌవనపడిలో పడుతున్న ఆమె సౌందర్య శరీరం కొత్త సిగరెట్టు పెట్టెలా, బిగువుగా. నీటుగా, పటుత్వంగా ఉంది.

ఆక్రొత్త సిగరెటు పెట్టెను విప్పాను. అందులోని ముచ్చి బంగారాన్ని సద్దాను. ఆ ముచ్చిబంగారపు చప్పుడలా ఆమె సన్నని సిల్కుచీర గాలికి కదులుతూ సన్నని రొదచేస్తూ రెపరెప లాడింది.

ఒక సిగరెట్టుతీసి నా ఎర్రటి పెదిమలమధ్య స్థాపితంచేశాను. ఆమె కళ్లు తెల్లని సిగరెట్టువెలుగులా తళుక్కున మెరిశాయి.

అగ్గిపెట్టెకోసం జేబు తడిమాను.

జేబులోని పైసలు గల్లుమనినాయి. మా కమల గాజులుకూడా గలగల శబ్దంచేశాయి.

అంటించబోతూన్న సిగరెట్టువైపు ఒక్కసారి చూశాను. నల్లటి పొగాకును చుట్టగా చుట్టుకున్న ఆ తెల్లటి సిగరెట్టులాగా, తెల్లగా మిసమిసలాడే సిల్కుచీరలో నిగనిగలాడే నల్లటిసౌందర్యంతో ఆకర్షణీయంగా ఉంది మాకమల. ముచ్చిబంగారపు తళుకుల్లాంటి నవ్వులు వెదజల్లిందామె.

మహామారిలాఉన్న అగ్గిపెట్టెలోని ఒక పుల్లతీసి, నిప్పు ముట్టించాను. మాకమల నిశ్శబ్దంగా కూర్చుంది.

నాసిగరెట్టుమీద కంపెనీవారు చెక్కిన బంగారపుపేర్లు, మాకమల తెల్లచీరమీద పొదిగిన జరీపువ్వుల్లా ఉన్నాయి.

సిగరెట్టుచివర నిప్పుముట్టించాను. ఒక్క నిట్టూర్పుతో మా కమల నాకేసి ఒక ఆనందకరమైన చురుకుచూపు విసిరింది.

నాసిగరెట్టు చివరనిప్పు ప్రజ్వరిల్లసాగింది, పొగలు గుండ్రని రింగుల్లా చల్లగాలిలో తేరుకున్నై. మాకమల ముఖం ఆ పొగ రింగుల్లో ప్రతిచోట ఫోటోలోలా కనిపించింది. నా ఎదురుగాఉన్న కమల శతసహస్రసుందరుల్లా మారిపోయింది. ఆ తేలిపోతూన్న గాలిలో ఆమె ముఖారవిందాలు తేలిఆడుతూ దూరంగా ఇంకాదూరంగా పోతున్నాయి. ఆ ముఖాల అందంచూస్తూ తన్మయుడనై పోయాను.

చేతివేళ్ళు చురుక్కుమనకాలాయి. సిగరెట్టు ఆరిపోయింది. సిగరెట్టు నుంచి రాలిపోయిననుసి గాలికి చెదిరి, మాయిద్దరి తెల్లటిబట్టలు కళంకం చేశాయి.

ఊహాగానాల్లోంచి తేరుకున్న నన్ను చూసి మాకమల నవ్వింది. ఆ నవ్వు ఎన్నో కమ్మనికలలు, తీయని ఆలోచనలు, నాకుఅందిస్తూ స్వాగత మిచ్చింది.

ఆస్వాగతాన్ని స్వీకరించేలోపలే, కమలకు మ హా మా రి లా ం టి మశూచివచ్చింది. నా సిగరెట్టు నుసిలా, ఆమె జీవితం రాలిపోయింది. నా సిగరెట్టునుసిలా నా జీవితం కూలిపోయింది.

*   *   *   *

చితికిన రామమూర్తి, గతించిన కమల, పొతకలా ఎదుగుతున్న నా పూర్వయజమాని, పొగరుబోతు తాతబాబు, యీ సిగరెట్టుద్వారా నా కందిచ్చిన అనుభవాలు అపూర్వం. సిగరెట్టు కాల్చవద్దని బడిపంతులు చెప్పే పాఠాలకన్న బడిబయట దొంగతనంగానే పొందిన ఈ సిగరెట్టు నాకు ఎక్కువపాఠాలు నేర్పింది.

———